

శుక్రవారం దౌల్తాబాద్ మండలంలో అధికారులతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి

## కొడంగల్ అనధికార ఎమ్మెల్యేగా తిరుపతిరెడ్డి

- అధికారులతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ కరవు
- సీఎం సోదరుడికి రెండు కాన్వాయ్‌లు, గన్‌మెన్లు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గానికి అనధికారిక ఎమ్మెల్యేగా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏ హోదా లేకున్నా నియోజకవర్గంలో జరిగే అన్ని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా శుక్రవారం దౌల్తాబాద్ మండలంలో స్వయంగా అధికారులతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం నియోజకవర్గంలో ఆయన పెత్తనం తారాస్థాయికి చేరిందనడానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. కొడంగల్‌కు ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డా? ఆయన సోదరుడు తిరుపతిరెడ్డా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సీఎం సోదరుడు అయినంత మాత్రాన అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని నిలదీస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు, స్థానిక ఎంపీకి కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులకు ఆదేశాలు జారీచేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. తిరుపతిరెడ్డి సీఎం తమ్ముడు కావడంతో అధికారులు సైతం ఆయన చెప్పుచేతల్లో ఉంటున్నారని విమర్శిస్తున్నారు.

### తిరుపతిరెడ్డికి రెండు కాన్వాయ్‌లు, గన్‌మెన్లు ఎందుకు?

తిరుపతిరెడ్డికి రెండు కాన్వాయ్‌లు, గన్‌మెన్లను ఎందుకు అనుమతించారని దౌల్తాబాద్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోట్ల మహిపాల్ ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రభుత్వం తక్షణమే కాన్వాయ్‌లు, గన్‌మెన్లను తొలగించకుంటే హైకోర్టులో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సీఎం బంధువులకు ప్రభుత్వ అధికారుల సేవలను వినియోగించడమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. అధికారం ఉందని ఇష్టారీతిన వ్యవహరిస్తే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. తిరుపతిరెడ్డి అరాచకాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎండగడతారని హెచ్చరించారు.

### గడిగడ్డలో నీటికి కటకట



ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే గల గడిగడ్డ కాలనీలో ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నారు. 15 రోజులుగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీరు అందకపోవడంతో ఐదు రోజులకోసారి వచ్చే ట్యాంకర్ నీటితో సరిపెట్టుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – ములుగు రూరల్

# యూరియా కోసం బారులు

## వీర్నపల్లిలో రైతుల ఇక్కట్లు • బస్తాల కోసం గంటల తరబడి నిరీక్షణ

వీర్నపల్లి, జనవరి 4 : యూరియా కోసం మళ్లీ రైతులు బారులు తీరాల్సి వస్తున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం వందలాదిమంది యూరియా బస్తాల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. గోదాం వద్దకు యూరియా లారీ వచ్చిందన్న సమాచారం అందడంతో భూక్యా తండా, బాబాయిచెరువుతండా, బావుసింగ్ తండా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సొసైటీ సిబ్బంది టోకెన్లు ఇస్తుండటంతో రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నారు. ఒక్కో రైతుకు మూడు యూరియా బస్తాలు మాత్రమే ఇచ్చారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చుంటే మూడు బస్తాలు మాత్రమే ఇవ్వడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పది రోజులుగా నిరీక్షిస్తున్నామని, సాగుకు అవసరమైన యూరియా ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. బీఆర్ఎస్ హయాంలో సొసైటీల్లో యూరియా అవసరమైన మేర సరఫరా జరిగేదని తెలిపారు. ఇప్పుడు కొరత సృష్టించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఏవో జయను ఫోన్‌లో సంప్రదించగా అల్మాస్‌పూర్ సొసైటీ పరిధిలోని వీర్నపల్లికి ఇప్పటికే మూడు లారీల యూరియా వచ్చిందని, మరో ఏడు లారీల లోడ్ రావాల్సి ఉన్నదని తెలిపారు. రైతులందరికీ యూరియా అందించాలనే మూడు బస్తాల చొప్పున పంపిణీ చేశామని వెల్లడించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి సొసైటీ వద్ద యూరియా టోకెన్ల కోసం రైతుల బారులు

# ఉద్యోగాలు ఊడుతయ్!

- కొత్త వారితో భర్తీ చేస్తాం
- సీఆర్టీలకు మంత్రి సీతక్క వార్నింగ్
- 19 రోజులుగా సమ్మెలో టీచర్లు
- చర్చల సమయంలో బెదిరింపులు
- ఉద్యోగాలకు భద్రత కల్పించేదాకా ఉద్యమం
- తేల్చిచెప్పిన సీఆర్టీ సంఘం
- 3 నెలలకు మళ్లీ సమ్మె చేస్తామని స్పష్టీకరణ

### రాజ్యాంగం ప్రకారం సాధ్యమే..

రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్ ప్రకారం గిరిజనాభివృద్ధి కోసం తెచ్చిన ప్రత్యేక అధికారాల వల్ల సీఆర్టీలను క్రమబద్ధీకరించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుందని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నాయకులు శివనాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశ పూర్వకంగానే సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ సర్కారులో సాంఘిక సంక్షేమ శాఖ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన దాదాపు 750 మంది టీచర్లను రెగ్యులర్ చేసిందని, ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో కాంట్రాక్టు లెక్చరర్లను కూడా బీఆర్ఎస్ హయాంలో రెగ్యులర్ చేశారని తెలిపారు. వాటికి సాధ్యమైనప్పుడు.. సీఆర్టీలకు మాత్రం ఎందుకు సాధ్యం కాదని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): 'తెగేదాక లాగొద్దు.. ఉద్యోగాలు ఊడుతయ్.. జీవో 16ను హైకోర్టు కొట్టివేసింది. న్యాయపరంగా సాధ్యం కాదు. కొత్త నోటిఫికేషన్ ఇస్తే.. కొత్త వారికే అవకాశాలు దక్కుతాయి.. అందుకని సమ్మె విరమించండి' అంటూ 19 రోజులుగా సమ్మెలో ఉన్న గిరిజన ఆశ్రమ కాంట్రాక్టు టీచర్లకు (సీఆర్టీ) మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలతో మంత్రి చర్చలు జరిపారు. ఈ సందర్భంగానే సీఆర్టీల ఉద్యోగ భద్రత కల్పించాలన్న డిమాండ్‌ను పక్కనబెట్టి.. ఇతర అంశాలపై మంత్రి చర్చలు జరిపారు. ఈ విషయంలో సీఆర్టీలను అణచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సీఆర్టీలకు ప్రతినెలా 5 లోపు జీతాలు విడుదల చేస్తామని, మహిళా టీచర్లకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇస్తామని, మినిమం టైం స్కేల్ (ఎంటీసీ) ఇస్తామని మాత్రమే హామీ ఇచ్చారు. కానీ ఉద్యోగ భద్రత అంశంపై మాత్రం ప్రభుత్వం నోరు మెదపడం లేదని సీఆర్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇతర అంశాల కంటే ఉద్యోగ భద్రతే ప్రధాన డిమాండ్ అని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజ్మీరా శివనాయక్ స్పష్టం చేశారు. చర్చల పేరుతో పిలిచిన మంత్రి బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



### సర్కార్‌కు రెండు నెలల గడువు

మంత్రి సీతక్క వద్ద జరిగిన చర్చల అనంతరం 19 రోజులుగా చేసిన సమ్మెను తాత్కాలికంగా విరమించామని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తెలిపారు. ఇది తాత్కాలికమే అని, మూడు నెలల్లో తమ డిమాండ్ల పరిష్కారం కాకుంటే మళ్లీ సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మినిమమ్ టైంస్కేల్ ద్వారా ప్రతినెలా రూ.49 కోట్లు, ఉద్యోగ భద్రతతో రూ.69 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. మధ్యలో ఉన్న తేడా కేవలం రూ.20 కోట్లు మాత్రమేనని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆ సంఘం నాయకులు కోరుతున్నారు.

## యూరియా పంపిణీకి తొలగిన ఇక్కట్లు

### నేరుగా ఆధార్, ఫోన్ నంబర్ల నమోదు

బయ్యారం, జనవరి 4 : బయ్యారం సహకార పరపతి సంఘంలో రైతులకు శనివారం నేరుగా ఆధార్, ఫోన్ నంబర్లను నమోదు చేసి యూరియా పంపిణీ చేశారు. ఈ-పాస్ మెషిన్ ద్వారా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేసి యూరియా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. సర్వర్ సమస్యలు తలెత్తడంతో మండలంలోని పలు గ్రామాల నుంచి యూరియా కోసం వచ్చిన రైతులు వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో 'యూరియా కోసం రైతుల ఇక్కట్లు' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి ఆశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. రైతుల ఆధార్, ఫోన్ నంబర్లు నమోదు చేసి యూరియా అందజేశారు. అనంతరం ఓటీపీ ద్వారా ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. ఉప్పలపాడు, గంధంపల్లి, కంబాలపల్లి సబ్ సెంటర్ల ద్వారా కూడా యూరియా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

## జీతాలు రాలె

హైదరాబాద్, జనవరి4 (నమస్తే తెలంగాణ): ప్రతి నెలా ఒకటవ తేదీనే జీతాలు వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ ఉత్తముచ్చటగానే మిగిలిపోతున్నాయి. బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లోని ఉద్యోగులకు ఇప్పటివరకు వేతనాలను చెల్లించలేదు. ఎస్సీ సొసైటీలోని పార్ట్‌టైం ఉద్యోగులకైతే దాదాపు 2 నెలలుగా వేతనాలను చెల్లించని దుస్థితి నెలకొన్నది. సొసైటీ పరిధిలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ కాలేజీలో పలువురికి 5 నెలలుగా జీతాలను చెల్లించలేదు.

# రేవంత్‌రెడ్డిది రెండు నాల్కల ధోరణి

- నాడొక మాట.. నేడు ఇంకో మాటా?
- ఎస్ఎస్ఏ ఉద్యోగుల మండిపాటు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): 'మీకు ఉద్యోగావకాశాలు ఇప్పించిందే కాంగ్రెస్. మేం అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే మిమ్మల్ని సచివాలయానికి పిలిచి సగౌరవంగా సంఘాలతో కూర్చుని మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం' ఇదీ 2023 సెప్టెంబర్ 13న హనుమకొండలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల ధర్నానుద్దేశించి నాడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ. 'సమగ్ర శిక్షా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రెగ్యులరైజ్ చేయాలని పట్టుబడితే సమస్య పరిష్కారం కాదు' ఇది 2024 జనవరి 3న సచివాలయంలో ఉద్యోగ సంఘాల డైరీ ఆవిష్కరణలో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు. ప్రతిపక్షంలో ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్నారంటూ రేవంత్ వైఖరిపై ఎస్ఎస్ఏ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. ఏడాది తిరగగానే సీఎం హోదాలో రెండు నాల్కల ధోరణిని ప్రదర్శించారంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబర్ 13న హనుమకొండలో సమగ్రశిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరానికి వచ్చి ఇచ్చిన హామీని మరిచారా? అంటూ సీఎంను వారు నిలదీస్తున్నారు. దాటవేత ధోరణిని ప్రదర్శించడం తప్పించుకోవడమే అవుతుందని మండిపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమను చర్చలకు పిలిపిస్తే పరిష్కారమార్గాలను చూపెడతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, అనిల్‌చారి, దుర్గం శ్రీనివాస్, సురేందర్, సహదేవ్, శ్రీధర్‌రెడ్డి, జానకిరామ్, మహేందర్, రమేశ్, బిందుశ్రీ, అమృత, సంధ్యారాణి, జయశ్రీ తదితరులు కోరారు.






# పంచాయతీ కార్మికుల వేతనాలేవీ?

- కొత్త ఏడాది నుంచి నేరుగా ఇస్తామన్న సర్కారు
- నెలక్రితమే అకౌంట్, ఆధార్‌కార్డుల సేకరణ
- నాలుగురోజులైనా చెల్లించని ప్రభుత్వం
- 52 వేల మంది సిబ్బంది ఎదురుచూపులు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): కొత్త ఏడాది నుంచి ఉద్యోగుల తరహాలో పంచాయతీ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లిస్తామని చెప్పిన సర్కారు మాటతప్పింది. గడువు ముగిసి నాలుగురోజులైనా ఖాతాల్లో నగదు జమచేయడంలో విఫలమైంది. ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఒకేసారి వస్తాయని సంబురపడ్డ కార్మికుల్లో నైరాశ్యం అలుముకున్నది. ఇదే విషయమై పంచాయతీరాజ్‌శాఖ అధికారులను అడిగితే తమకేమీ తెలియదంటూ దాటవేస్తున్నారని పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

### నెల క్రితమే వివరాల సేకరణ..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 52 వేల మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500 చొప్పున వేతనాలు ఇస్తున్నది. జీతాలు నేరుగా ఇవ్వకపోవడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని భావించి నేరుగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా సిబ్బంది బ్యాంక్ ఖాతాలు, ఆధార్‌కార్డులు సేకరించింది. కొత్త సంవత్సరం నుంచి నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమచేస్తామని ప్రకటించింది. కానీ, గడువు ముగిసినా ఖాతాల్లో నగదు జమచేయలేదని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



### ఆరునెలలుగా అందని వేతనాలు..

పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పంపు ఆపరేటర్లు, ట్రాక్టర్ల డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. గతేడాది వరకు ప్రభుత్వం ప్రతినెలా పల్లెప్రగతి నిధులు ఇచ్చేది. ఆర్థిక సంఘం నుంచీ క్రమం తప్పకుండా నిధులు మంజూరయ్యేవి. దీంతో సిబ్బంది వేతనాలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి.

### సర్కారు మాట తప్పింది..



ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తున్నది. కొత్తేడాది నుంచి క్రమం తప్పకుండా ఖాతాల్లో జీతాలు వేస్తామని చెప్పి మాటతప్పింది. గడువు ముగిసి నాలుగు రోజులైనా నగదు వేయలేదు. అధికారులను అడిగితే మాకు తెలియదంటున్నారు. నిరుపేదలైన కార్మికులను ఇబ్బందిపెట్టడం సమంజసం కాదు. ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలి.

– గ్యార పండు, జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

## బాలికల బాత్రూంలో ఫోన్ రికార్డింగ్

- ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన
- నిందితుడి అరెస్టు • కాలేజీని తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

మహబూబ్‌నగర్, జనవరి 4 : విద్యార్థినుల టాయిలెట్‌లో సెల్‌ఫోన్‌తో వీడియో రికార్డు చేసిన దారుణ ఘటన శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చోటుచేసుకున్నది. కళాశాల విద్యార్థినులు, డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి బ్యాక్‌లాగ్ పరీక్షలు రాసేందుకు వచ్చాడు. విద్యార్థినుల బాత్‌రూంలో సెల్‌ఫోన్ వీడియో ఉంచి రికార్డులో పెట్టాడు. విద్యార్థినులు బాత్‌రూంలోకి వెళ్లగా అక్కడ సెల్‌ఫోన్ కెమెరా ఆన్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆ ఫోన్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. ప్రిన్సిపాల్ వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి వివరాలను సేకరించారు. విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, కళాశాలల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్సై శ్రీనయ్య విద్యార్థుల ఆందోళనను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తన సెల్ ఫోన్ కనపడటం లేదని నిందితుడు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశాడు. సదరు విద్యార్థిని షీటీం వారు అదుపులోకి తీసుకొని విచారించి సెల్‌ఫోన్ అతడిదే అని తెలుసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి కళాశాలకు చేరుకొని విద్యార్థినుల టాయిలెట్లతోపాటు కళాశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పోలీసులతోపాటు ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.




టాయిలెట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి

## ముఖ్యమంత్రిని కలిస్తేనే జీతాలిస్తరా?

- సీఎంను కలిసిన మెప్మా ఆర్పీలు
- ఎట్టకేలకు 7 నెలల జీతాలు విడుదల
- చర్చానీయాంశంగా మారిన వైనం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిస్తేనే పెండింగ్ జీతాలు విడుదలవుతాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. తాజాగా మెప్మా ఆర్పీలకు జీతాలు విడుదలవడం అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. రాష్ట్రంలో మెప్మా ఆధ్వర్యంలో పని చేస్తున్న ఆర్పీల జీతాలు ఇవ్వాలని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. తమకు ఏడు నెలలుగా జీతాలు విడుదల చేయడం లేదని, వాటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం వెంటనే జీతాలివ్వాలని మెప్మా డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం గత జూన్ నుంచి నవంబర్ వరకు పెండింగ్ ఉన్న రూ.20.30 కోట్లు విడుదల చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 1,054 మంది, జిల్లాల పరిధిలో 4,586 కలిపి మొత్తం 5,640 మందికి జీతాలు విడుదలైనట్టు పేర్కొన్నారు. ఏడు నెలలుగా నిలిచిపోయిన జీతాల కోసం సీడీఎండీ ముట్టడి, ఇందిరా పార్కు వద్ద ధర్నాలు, నిరసనలు చేపట్టినా విడుదల కాని జీతాలు, సీఎం రేవంత్‌ను కలిసిన వెంటనే విడుదల కావడంపై చర్చనీయాంశంగా మారింది.

## 'ప్రీమియర్' కంపెనీలో భారీ పేలుడు.. ఒకరి మృతి

- మృతుడు జనగామ జిల్లా బచ్చన్నపేటవాసి
- మరో ముగ్గురికి గాయాలు

బచ్చన్నపేట/ యాదగిరిగుట్ట, జనవరి 4 : యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ లిమిటెడ్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. శనివారం ఉదయం 9.45 గంటల సమయంలో కంపెనీలోని పీఆర్డీసీ భవనం-3లోని ఫెర్రో డివైజ్ ఫిల్లింగ్ అండ్ ప్రెస్సింగ్ భవనంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో అక్కడే విధుల్లో ఉన్న జనగామ జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన కార్మికుడు మార్క కనకయ్య(54) అక్కడిక్కడే మృతి చెందాడు. యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. పూర్తి విచారణ అనంతరం వెల్లడిస్తామని పీఈవో కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కార్మిక సంఘం నాయకులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని చెప్పారు. కంపెనీని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సందర్శించారు. యాజమాన్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని, వారిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ చెప్పారు.